

స్థానిక ఎన్నికలు సజావుగా సాగాలి

స్థానిక సంస్థల ఉప ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. -10లో..



అన్నను చంపిన తమ్ముడు

మద్యం మత్తులో అన్నను తమ్ముడు కర్రతో కొట్టి దాడిచేసి హత్య చేశాడు. ఒంగోలు నగరంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. -10లో..

గరిష్టం/కనిష్టం 37/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఆదాయ పన్ను నూతన విధానంపై అవగాహన

ఒంగోలు: సీనియర్ సిటిజన్స్ పెన్షనర్ల సౌలభ్యం కోసం శనివారం ఆదాయపు పన్ను–నూతన విధానం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సుపరిపాలన వేదిక అధ్యక్షుడు మాగులూరి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాక్స్ కన్సల్టెంట్, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సీవీఎల్ సుబ్రహ్మణ్యం విశదీకరిస్తారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరుగుతుంది.

ఓటర్ల జాబితాలో కచ్చితత్వం కీలకం

- ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఓటరు జాబితా సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా సవరణలో కచ్చితత్వం ఎంతో కీలకమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను స్థానిక సుజాత నగర్‌లో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 93వ నంబర్ పోలింగ్ కేంద్ర పరిధిలో 576 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జాబితాలో చేర్పులు, తొలగింపులపై క్షేత్రస్థాయి సిబ్బంది పాటిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వచ్చానన్నారు. విధుల నిర్వహణ నిర్లక్ష్యం వహించిన 90–100 పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్ కె శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. కలెక్టర్‌తో పాటు ట్రెనీ కలెక్టర్ శౌర్య పటేల్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహశీల్దార్ మురళి తదితరులు ఉన్నారు.

గెలాక్సీ మెరిసేలా..

ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి గ్రానైట్‌కు మంచిరోజులొచ్చాయి. ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇక్కడ 90 శాతానికిపైగా గ్రానైట్ పరిశ్రమలు ఉండటంతో జిల్లాను గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రానున్న రోజుల్లో భారీగా ఎగుమతులు పెరగడంతో పాటు వ్యాపారస్తులకు కాసుల వర్షం కురిపించనుంది. భవిష్యత్ సువర్ణయుగంగా మారనుంది.

- గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా జిల్లా
- భారీగా పెరగనున్న ఎగుమతులు
- సహకారం అందించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నోడల్ అధికారి

గ్రానైట్ క్వారీ



చీమకుర్తి:

గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాను ప్రకటించడంతో గ్రానైట్ పరిశ్రమకు ప్రోత్సాహం లభించినట్లయింది. కరోనా కారణంగా, చైనాలో అవసరానికి మించి గ్రానైట్ నిల్వలు ఉండడంతో గతేడాది నుంచి ఎగుమతులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ తరుణంలో గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా జిల్లాను ప్రకటించడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి చైనా, తైవాన్, వియత్నాం, ఇటలీ, యూకే, జర్మనీ, థాయ్‌ల్యాండ్, హాంకాంగ్ తదితర దేశాలకు గ్రానైట్ ఎగుమతవుతుంది. అందులో ఎక్కువ శాతం చీమకుర్తిలోని 60 గ్రానైట్ క్వారీల నుంచి ఎగుమతవుతోంది. చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెం, పేర్నమిట్ట, గుండ్లాపల్లి, మార్టూరు, బల్లికురవ తదితర ప్రాంతాల్లో సుమారు 2 వేలకుపైగా గ్రానైట్ ఫ్యాక్టరీలున్నాయి. ఎగుమతుల్లో పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా పరిశ్రమల అధికారుల ద్వారా రాష్ట్ర పరిశ్రమల అధికారులు కార్యాచరణ రూపొందించారు. గ్రానైట్ క్వారీలకు సులభతరంగా లీజులు మంజూరు చేయడం, ఎన్‌ఓసీలు జారీ, పన్నుల రాయితీలు వంటి ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఏడాదికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల ఎగుమతులు...

గెలాక్సీ గ్రానైట్ ఉత్పత్తులు జిల్లా నుంచి ఇతర దేశాలకు ఏడాదికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఎగుమతి అవుతున్నాయి. గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా ప్రకటించిన తర్వాత ఎగుమతయ్యే గ్రానైట్ ఉత్పత్తులు భారీగా పెరిగే అవకాశాలున్నాయని పారిశ్రామిక వేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ ఉత్పత్తులను ఎక్స్‌పోర్ట్ సమయంలో నిల్వ ఉంచుకునేందుకు అవసరమైన ప్లాట్‌ఫాంల సదుపాయాలు కల్పించటం, ఎగుమతి చేసే దేశాలలో మార్కెటింగ్ చేసుకునేందుకు అవసరమైన ప్లాట్‌ఫాంలను కల్పించేందుకు 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్' పథకం బాగా ఉపయోగపడుతోంది. గ్రానైట్ ఎగుమతులను నిల్వ ఉంచుకోవడానికి అవసరమయ్యే ఖర్చును కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం చొప్పున భరిస్తాయి. ఫలితంగా యజమానులకు అయ్యే ఖర్చులో భారం తగ్గడంతో మునుపటికంటే ఇంకాస్త మెరుగ్గా ఎగుమతుల సామర్థ్యం పెంచుకునేందుకు తోడ్పడుతుంది. దీంతో విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు ఏడాదికి కనీసం రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారుల వద్ద ఉన్న గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. గ్రానైట్ వ్యాపార పరంగా చూస్తే ఒక్కో క్యూబిక్ మీటర్ ఖరీదు సరాసరిన రూ.80 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఉంటుంది. జిల్లాలో ఏడాదికి 3 లక్షల క్యూబిక్ మీటర్లు ఎగుమతవుతున్న నేపథ్యంలో ఏడాదికి సరాసరిన రూ.3 వేల కోట్ల లావాదేవీలు జరుగుతున్నట్లు అంచనా. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రానైట్ పరిశ్రమకు స్వర్ణయుగం రాబోతోందని అటు అధికారులు, ఇటు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీనికి సంబంధించి గత నెల 20న గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో గ్రానైట్ స్టేక్ హోల్డర్స్‌తో సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. ఎగుమతులు చేయడానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, మార్కెటింగ్, వీసా సదుపాయాలు, నాలెడ్జ్ బేస్డ్ సమాచారం తదితరాలకు కేంద్ర స్థాయిలో ఫియో ఆర్గనైజేషన్ సహకారం అందించనుంది.



రామతీర్థంలోని గ్రానైట్ క్వారీలు



ప్రాసెస్ చేసిన గ్రానైట్ స్లాబులు

ఎగుమతులకు పూర్తి సహకారం

జిల్లాను గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా ప్రకటించాం. గ్రానైట్ ఉత్పత్తుల ఎగుమతులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం నిష్పత్తిలో ఆర్థిక సహకారం అందిస్తాయి. గ్రానైట్ పరిశ్రమ ఎగుమతులలో వ్యాపారులకు ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం.

– జీ శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్‌బోర్డు

నివేదిక సమర్పించా



గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో అందరితో మాట్లాడి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని తయారుచేసిన నివేదికను రాష్ట్ర పరిశ్రమల అధికారులకు సమర్పించా. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రానైట్ పరిశ్రమ ఎగుమతులు ఊపందుకోవడానికి దోహదపడుతుంది.

– బి.ఉదయ్‌కుమార్, నోడల్ ఆఫీసర్, గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ హబ్, ఒంగోలు

ప్రస్తుతం ఏడాదికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల ఎగుమతి



ప్రస్తుతం జిల్లాలో గెలాక్సీ గ్రానైట్ ఏడాదికి 3 లక్షల క్యూబిక్ మీటర్లు ఎగుమతవుతోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రానైట్ వ్యాపారులు తమ వ్యాపారంలో అవసరమైన లీజులు, ఎన్‌ఓసీలు సులభతరమవుతాయి. విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరిగే అవకాశం ఉంది. గతంలో కంటే ఎగుమతులు పెరుగుతాయి.

– బీ జగన్నాథరావు, మైన్స్ డీడీ, ఒంగోలు

ఎగుమతికి కావాల్సిన సహకారం, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ స్కీమ్‌కు టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ ఏడీ ఉదయ్‌కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. గ్రానైట్ పరిశ్రమ ఎగుమతులలో అవసరమైన సహాయ సహకారాలు, గ్రానైట్ పరిశ్రమ భవిష్యత్తుకు ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలపై నోడల్ ఆఫీసర్ తన నివేదికను విజయవాడ పరిశ్రమల ఆఫీస్‌కు పంపించారు.

వలపన్ని.. వెంటాడి

- నడిరోడ్డుపై వీఆర్వోను పట్టుకున్న ఏసీబీ అధికారులు
- రూ.21 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏరువారిపల్లి వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి
- లంచం ఇవ్వడం ఇష్టం లేక వీఆర్వోను పట్టించిన వలంటీర్



పట్టుబడిన వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి



రైతుల వేషంలో నడిరోడ్డుపై వీఆర్వోను అదుపులోకితీసుకుంటున్న ఏసీబీ అధికారులు

కనిగిరి రూరల్: పాస్ పుస్తకాల మ్యుటేషన్‌కు వీఆర్వో లంచం డిమాండ్ చేయడంతో డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక కనిగిరి మండలం ఏరువారిపల్లి వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డిని అదే సచివాలయ పరిధిలో పనిచేసే వలంటీర్ ఏసీబీ అధికారులకు పట్టించాడు. వివరాల్లోకి వెళితే కనిగిరి మండలం పేరంగుడిపల్లికి చెందిన వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి గోసులవీడు గ్రామవలంటీర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి లక్ష్మిరెడ్డి పేరు మీద మండలంలోని అజీస్‌పురంలో 2.73 ఎకరాల భూమి ఉంది. దీన్ని మ్యుటేషన్ చేయించుకునేందుకు గత నెల 24న గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ తర్వాత పాస్‌బుక్‌ల మ్యుటేషన్ కోసం వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డిని కలిశాడు. అతను రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు ఇద్దరి మధ్య రూ.21 వేలకు బేరం కుదిరింది. లంచం ఇవ్వడం ఇష్టంలేని వీఆర్వో ఏసీబీ అధికారులకు ఈనెల 9న ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన ఏసీబీ అధికారులు 11న శుక్రవారం కేసు రిజిస్టర్ చేసుకుని.. ఏసీబీ డీఎస్పీ వీ శ్రీనివాసరావు బృందం దాడులు నిర్వహించింది.

వెంటాడి నడిరోడ్డుపై పట్టుకున్న ఏసీబీ అధికారులు..

ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం ఏసీబీ అధికారులు రైతుల వేషధారణలో తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణాల్లో కాపు కాశారు. ఏసీబీ అధికారులు వీరం రెడ్డి భాస్కర్‌రెడ్డి చేతికి రూ.21 నగదును అందజేశారు. సుమారు 12 గంటల సమయంలో భాస్కర్‌రెడ్డి.. వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డికి నగదు ఇస్తానని చెప్పాడు. దీంతో వీఆర్వో , వలంటీర్‌ని బైక్ పై ఎక్కించుకుని పట్టణంలో కందుకూరు రోడ్డు వైపు ఉన్న కపిలా హోటల్ సెంటర్‌కు తీసుకెళ్లి నగదు తీసుకున్నాడు. అప్పటికే వీఆర్వోను వెంటాడుతున్న ఏసీబీ ట్రాప్ పార్టీ అధికారులు ఒక్క సారిగా రోడ్డుపై చుట్టుముట్టారు. దాన్ని గమనించిన వీఆర్వో తీసుకున్న నగదును జేబులో నుంచి కింద పడేశాడు. వెంటనే ఏసీబీ అధికారులు వీఆర్వో రెండు చేతులు గట్టిగా వెనక్కి మడిచి పట్టుకున్నారు. రోడ్డు పైనే స్టూల్ పెట్టి ఏసీబీ అధికారులు వెంట తెచ్చిన రసాయనం కలిపిన నీటిలో వీఆర్వో చేతులను కడిగించగా, నీళ్ల రంగు మారాయి. ఈ ఘటన అంతా నడిరోడ్డుపై దాదాపు 15 నిమిషాలు సాగింది. ట్రాఫిక్‌కు అంతరాయంగా మారడంతో వీఆర్వో వేణును పోలీసుల సహకారంతో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణానికి తరలించి, తదుపరి విచారణ ప్రక్రియ ప్రారంభించారు. వీఆర్వో వద్ద లెక్కలో లేని నగదు మరో రూ.32,300 ఉంది. ఏసీబీ అధికారుల ట్రాప్‌నకు ముందు ఇద్దరు రైతుల వద్ద ఈ నగదును తీసుకున్నట్లు అధికారులు గుర్తించి, విచారణ జరిపి వారి వద్ద కూడా ఫిర్యాదు తీసుకుంటామని తెలిపారు.

మాచవరంలోని ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు:

వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి స్వగ్రామమైన మాచవరానికి వెళ్లి అతని ఇంట్లో ఏసీబీ సీఐ అపర్ణ సోదాలు నిర్వహించారు. ఇంట్లో 10 ఈ–పాస్ బుక్‌లు ఐదేళ్ల నాటివి దొరికినట్లు ఏసీబీ డీఎస్పీ వీ శ్రీనివాసరావు తెలిపారు. అయితే ఆ పాస్‌బుక్‌లు తిరిగి ఇవ్వకుండా అతని దగ్గరే ఎందుకు ఉంచుకున్నాడు అనే దానిపై విచారణ చేపడతామని డీఎస్పీ వెల్లడించారు. వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి అరెస్ట్ చేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఏసీడీ దాడుల్లో ఏసీబీ సీఐలు అపర్ణ, సీహెచ్ శేషు, టీవీ శ్రీనివాసులు, ఎస్సై జేవీఎన్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితుడు వీరం రెడ్డి భాస్కర్‌రెడ్డి తొలుత ఈనెల 6న 14400 యాప్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే 14400 యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిర్యాదుదారుల పేర్లను, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తర్వాత విచారణ జరిపి నిజమైతే చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులు పరార్..

వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకోగానే వివిధ శాఖ అధికారులు పరారయ్యారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయంలోని వీఆర్వోలు, వివిధ స్థాయిల్లోని అధికారులు అదృశ్యమయ్యారు. రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో సబ్ రిజిస్టర్ ఆఫీసులోని అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు పత్తా లేకుండా పోయారు. బిక్కు బిక్కు మంటూ సబ్ రిజిస్టర్ ఆఫీసులో ఇతర సిబ్బంది విధులు నిర్వహించారు. ఏసీబీ అధికారులు కనిగిరి వదిలి పోయేంత వరకు పలు శాఖల ఉన్నతాధికారులు వారి సీట్లల్లో కూర్చోలేదంటే అతిశయోక్తి కాదు. పలువురు వీఆర్వోలు, రెవెన్యూ, ఇతర రెండు శాఖల్లోని ప్రధాన అధికారుల పేర్లు ఏసీబీ జాబితాలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అండ

- జిల్లాలో రూ.288.26 కోట్ల లబ్ధి
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



మహిళలకు సున్నా వడ్డీ రుణాల చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, పీడీసీసీబీ చైర్మన్ ప్రసాదరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు సున్నా వడ్డీకి రుణాలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సున్నా వడ్డీ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వడ్డీ డబ్బు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. దీనికి అనుబంధంగా జిల్లా స్థాయిలో ప్రకాశం భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు ట్రెనీ కలెక్టర్ శౌర్యపటేల్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పీడీసీసీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత పలువురు ప్రజా ప్రతినిదులు, సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 49,068 స్వయం సహాయక సంఘాల్లోని 4,95,254 మంది లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. 2019–20 సంవత్సరంలో రూ.80.05 కోట్లు, 2020–21లో రూ.69.26 కోట్లు, 2021–22లో రూ.73.29 కోట్లు, 2022–23లో రూ.65.66 కోట్లు, జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం రూ.288.26 కోట్లు స్వయం సహాయక సంఘాలకు ప్రయోజనం కలిగిందని వివరించారు. సంఘాల్లోని మహిళలకు ఆర్థిక సాధికారత కల్పిస్తూ వారి వ్యాపారాలకు ఊతమిచ్చేలా సున్నా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తుందన్నారు. ఈ ఆర్థిక సహాయాన్ని జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకునేలా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళలకు అన్ని విషయాల్లో అండగా ఉంటూ మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిరూపించుకున్నారన్నారు. దీనిలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర టైలర్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్‌పర్సన్ షేక్ సుబాన్‌బీ, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దిన వేడుకల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15వ తేదీ నిర్వహించే స్వాతంత్య్ర దిన వేడుకల ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ మలికా గర్గ్ పరిశీలించారు. పోలీసు కవాతు రిహార్సల్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పరేడ్ వాహనంలో వెళ్లి కవాతులో పాల్గొనే పోలీసులతో మాట్లాడారు. కవాతు నిర్వహణలో మెళకువలను, సలహాలను వారికి సూచించారు. అద్భుతమైన కవాతు ప్రదర్శనతో ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. ఆ తరువాత అతిథుల గ్యాలరీ, పౌరుల గ్యాలరీ, స్టాల్స్, శకటాల ప్రదర్శనకు ఏర్పాటు చేసిన ప్రాంతాలను పరిశీలించి ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాల పార్కింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు హరిబాబు, శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో ఎన్నడూ లేని అభివృద్ధి



పెరిదేపి ప్రాథమికోన్నత పాఠశాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్ కుమార్

పెరిదేపి (కొండపి): జిల్లా చరిత్రలోనే గతమెన్నడూ జరగని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు కేటాయించి చేస్తున్నారని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పెరిదేపి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముప్పరాజు శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ముప్పవరం, పెరిదేపి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా దాత ఎన్ఆర్ఐ ఎం.శ్రీనివాసులు సమకూర్చిన విద్యార్థులకు 15 సైకిళ్లు, ప్రింటర్స్‌అండ్ స్కానర్స్, స్పోర్ట్స్ కిట్స్, కూలింగ్ క్యాన్స్, ఐరన్ ర్యాకులు, నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్ మొత్తం సుమారు రూ.4 లక్షల విలువైన వివిధ వస్తువులను ముప్పవరం, పెరిదేపి, కొండపి ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ అందించి మాట్లాడారు. ముప్పవరం హైస్కూల్ పూర్వ విద్యార్థి ఎం.శ్రీనివాసులు తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను మర్చిపోకుండా పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వటం అభినందనీయం అన్నారు. జిల్లాలో గత ప్రభుత్వాలు చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి రెండు దశల్లో రూ.1200 కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దుతున్నారని చెప్పారు. ప్రభుత్వంతో పాటు పిల్లల చదువుకు తల్లిదండ్రులు సైతం బాధ్యత తీసుకోవాలన్నారు. కనీసం తల్లిదండ్రులు నెలకు ఒకసారైనా పాఠశాలలకు వచ్చి తమ పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవాలన్నారు. పిల్లలు డ్రాప్‌అవుట్స్ కాకుండా చూసుకోవాలని ప్రతి రోజు ఇంటి దగ్గర పిల్లలతో వారి చదువు గురించి మాట్లాడాలన్నారు. గత సంవత్సరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్ ప్రవంతికి ఎన్ఆర్ఐ ఎం.శ్రీనివాసులు అందించిన రూ.15 వేల నగదు ప్రోత్సాహాన్ని కలెక్టర్ చేతుల మీదగా విద్యార్థినికి అందించారు. ముప్పవరంలో విశ్రాంత ఉపాధ్యాయులను కలెక్టర్ పాఠశాల పూర్వ విద్యార్థులతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ పుబ్బారావు, తహసీల్దార్ పీ నరసింగరావు, ఎంపీడీఓ యంవీ రమణమూర్తి, మండల ప్రత్యేక అధికారిణి కే అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈఓ వీఎస్ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని స్పష్టం చేశారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు సెప్టెంబర్ 16 చివరి తేదీ అని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలు డీఈఓ కార్యాలయంలో సెప్టెంబర్ 19వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మార్కాపురం రూరల్: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ సర్పంచి లక్ష్మయ్య కుమారుడు రమేష్(20) డిగ్రీ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు ఏదో ఒక పని చూసుకోమని చెబుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రమేష్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. ఇంటి పక్కన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

రెండు బైకులు దగ్ధం

మార్కాపురం: స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని షాదీఖానా వెనుక రెండు బైకులను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ సంఘటన శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. బాధితుడు వినయ్‌కుమార్ ఇంటి ముందు తన బైక్‌తోపాటు తండ్రి బైక్‌ను పార్కింగ్ చేశాడు. శుక్రవారం నిద్ర లేచి చూడగా రెండు బైకులు కాలిపోయి ఉన్నాయి. అర్ధరాత్రి వేళ బైక్‌లకు నిప్పు పెట్టారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

స్థానిక ఎన్నికలు సజావుగా సాగాలి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ దిశానిర్దేశం

ఒంగోలు అర్బన్: స్థానిక సంస్థల్లో ఆకస్మికంగా ఏర్పడిన ఖాళీల్లో ఉప ఎన్నికలు ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనం నుంచి డీపీఓ నారాయణరెడ్డితో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలు, 63 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మండలాల వారీగా సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన డీపీఓ నారాయణరెడ్డి

నామినేషన్ల పరిశీలన పూర్తి

జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలు, 63 వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. నామినేషన్ గడువు ముగిసే సమయానికి సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 132 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు, వార్డు స్థానాలకు 126 నామినేషన్‌లు వాలిడ్ అయినట్లు నిర్ధారించారు. తిరస్కరణకు గురైన నామినేషన్లకు సంబంధించి అభ్యంతరాలు తెలిపేందుకు శనివారం అవకాశం కల్పించారు. 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- పోలీసు సిబ్బందితో ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. శుక్రవారం నిర్వహించిన పోలీసు సంక్షేమ దివస్‌లో ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎస్పీని కలిసి వారి సమస్యలు విన్నవించుకున్నారు. సస్పెండ్, రిలీవ్‌తో పాటు కుటుంబ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను విన్న ఎస్పీ.. తగిన పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీవో ఏవో ఎం.సులోచన, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, స్పందన ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

బాలల చట్టాలపై అవగాహన అవసరం

- రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

యర్రగొండపాలెం: తల్లిదండ్రులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులకు బాల్యవివాహాల నిషేధ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో డ్రాపౌట్స్‌ను గుర్తించి బడిలో చేర్పించినట్లయితే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. లేదంటే వారు కార్మికులుగా మారడంతోపాటు చెడు అలవాట్లకు బానిసలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలతో మంచి జీవితం కోల్పోతారని చెప్పారు. అన్ని వర్గాలకు చెందిన పేద పిల్లలు చదువుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అమ్మఒడి పథకం ద్వారా నగదు అందిస్తున్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అనేక మంది పిల్లలకు మంచి జీవితాన్ని ప్రసాదించారన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులు తమ సమస్యలను విన్నవించుకునే అవకాశం ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఎస్సీ హాస్టల్‌ను మార్చాలి

ఎస్సీ హాస్టల్‌లోని గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణనాయక్‌ను ఆదేశించారు. కిటికీలు లేకపోవడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫ్యాన్లు సక్రమంగా తిరగడం లేదని, వాచ్‌మెన్ కొడుతున్నాడని, పరిశుభ్రంగా లేని నీటిని తాగాల్సి వస్తోందని, రాత్రి వేళ హాస్టల్ ఆవరణలో పాములు, తేళ్లు సంచరిస్తుంటాయని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పద్మావతి.. తక్షణమే హాస్టల్లో మైనర్ రిపేర్లు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, జిల్లా కమిషన్ సభ్యురాలు నీలిమ వంశీలత, సీడీపీఓ పద్మావతి, ఎంఈఓ మల్లునాయక్, ఎస్సై జి.కోటయ్య, సార్డ్స్ సంస్థ ఏపీఎం ఎం.మరియబాబు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో సింగపూర్ బృందం పర్యటన

పెద్దదోర్నాల: గిరిజనులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే ఉద్దేశంతో సింగపూర్ దేశానికి చెందిన బృందం శుక్రవారం పెద్దదోర్నాల మండలంలోని పలు గూడేల్లో పర్యటించింది. మర్రిపాలెం, పనుకుమడుగు, మంతనాల, పోతన్నగూడెం, నందిగూడెం, బీఎంసీ కాలనీల్లో కలియతిరిగిన సింగపూర్ ప్రతినిధులు స్థానిక పరిస్థితులను పరిశీలించారు. గూడేల్లో సోలార్ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, వాటర్ టెస్టింగ్ కోసం శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో సింగపూర్‌కు చెందిన డానిల్ చూఅయ్, లీ చుమింగ్, ఫణికుమార్, సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చెర్మన్ ప్రకాష్ బాబు, కోశాధికారి చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ చైర్మన్ జోగి వెంకటనారాయణ, ఎంసీ మెంబర్లు అంబడి జగన్‌మోహన్‌రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గూడేల్లో పరిస్థితులను పరిశీలిస్తున్న సింగపూర్ బృంద సభ్యులు

రైతుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

- పశుసంవర్థకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి
- 16 మంది రైతులకు మేలు జాతి కోడె దూడల అందజేత

నాగులుప్పలపాడు: రైతులు, పశుపోషకుల శ్రేయస్సు, పశుసంపద వృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని పశుసంవర్థకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చదలవాడ పశుక్షేత్రంలో ఒక్కోటి రూ.20 వేల విలువ చేసే 16 మేలు జాతి కోడెదూడలను శుక్రవారం రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జేడీ కృత్రిమ గర్భధారణ సౌకర్యం అంతగా అందుబాటులో లేని పశ్చిమ ప్రకాశం మండలాలైన యర్రగొండపాలెం, పుల్లలచెరువు, చంద్రశేఖరపురంలో సహజ సంపర్కం కోసం వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. పశుసంపద వృద్ధి కోసం ఈ కోడె దూడలను ఉచితంగా అందించడంతో పాటు వాటి పోషణ, ఆరోగ్య సంరక్షణ కోసం రూ.9,400ను ఒక్కో కోడె దూడకు ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోడె దూడలను చక్కగా పోషించుకుని, సహజ సంపర్కం అవసరాలకు వినియోగించుకుని ఈ జాతిని అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ షేక్.కాలేషా, పశుక్షేత్రం డీడీ బి.రవి, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు కోడె దూడలు అందిస్తున్న జేడీ బేబీరాణి



హైకోర్టు సీజేని కలిసిన కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ

ఒంగోలు అర్బన్: తిరుపతి నుంచి తాడేపల్లి వెళ్తున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం స్థానిక ఎన్ఎస్పీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. సీజేను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, ఎస్పీ మలికాగర్గ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

హెచ్‌ఎం భారతి బదిలీ పాఠశాలకు తీరనిలోటు


బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం భారతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

- జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ

సింగరాయకొండ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.భారతి బదిలీ తీరనిలోటని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ పేర్కొన్నారు. 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించడంతోపాటు వరుసగా నాలుగుసార్లు మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులు సత్తా చాటడంతో హెచ్‌ఎం భారతి కృషి ఎంతో ఉందని కొనియాడారు. ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు పి.రాధామాధవి, సీహెచ్ రమాదేవి, కె.పద్మ, కేవీ లక్ష్మి, ఎస్.కోటేశ్వరమ్మ, అనూరాధను శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికోన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాలను దాతల సహకారంతో అభివృద్ధి చేయడంలో తన భర్త హెచ్‌ఎం టి.ప్రభాకరరెడ్డి సహకారం అందించారని హెచ్‌ఎం భారతి పేర్కొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఎంపీటీసీ వాసవీదేవి, హెచ్‌ఎం మహాలక్ష్మి, రాంబాబు, బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, మేస్త్రీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: విమానయాన పరిశ్రమకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయక మంత్రి డాక్టర్ వీకే సింగ్ సమాధానమిచ్చారు. దేశంలో విమానయాన పరిశ్రమ నిర్వహణ, మరమ్మతుల రంగాన్ని విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉదార, పెట్టుబడిదారులతో స్నేహపూర్వక విధానాన్ని అనుమతించిందన్నారు. ఈ రంగానికి సంబంధించి ప్రత్యక్ష డేటా ఏదీ విమానయానశాఖ నిర్వహించడం లేదన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకై తిరుపతి విమానాశ్రయ సెంటర్‌కు సంబంధించి భారత విమానాశ్రయ అథారిటీ రెండు స్థలాలను గుర్తించి రెండు రౌండ్లు బిడ్లు కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. కానీ, బిడ్లు ఇంకా అందలేదని కేంద్ర మంత్రి చెప్పారు.

మద్యం మత్తులో అన్నను చంపిన తమ్ముడు

ఒంగోలు టౌన్: వాళ్లిద్దరూ చిన్నమ్మ, పెద్దమ్మ పిల్లలు. వరసకు అన్నాదమ్ములైనా అంతకు మించి మంచి స్నేహితులు. అయితే మద్యానికి బానిసైన వారిద్దరూ రోజూ కలిసి తాగేవారు. తాగి తిరిగేవారు. అలాంటిది ఏమైందో ఏమో తాగిన మత్తులో మాటమాట అనుకున్నారు. చివరికది హత్యకు దారితీసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు నగరంలోని బిలాల్ నగర్ పాపాకాలనీకి చెందిన దార్ల వెంకట చెన్నయ్య (45) ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటాడు. సత్యనారాయణపురం కరవది వీధికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేసే సిట్లా ఏడుకొండలు అతడికి వరసకు తమ్ముడు అవుతాడు. గురువారం రాత్రి చెన్నయ్య ఎప్పటిలాగే సత్యనారాయణపురంలోని ఏడుకొండలు వద్దకు వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో మాటమాట అనుకున్నారు. దాంతో ఆగ్రహానికి గురైన ఏడుకొండలు పక్కనే ఉన్న కర్ర తీసుకొని కొట్టాడు. అంతటితో ఊరుకోకుండా మద్యం తాగగా ఖాళీ అయిన సీసాతో కిందపడిపోయి చెన్నయ్యపై దాడికి దిగాడు. తలకు తీవ్ర గాయం కావడంతో చెన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రమణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు త్రివేణి ఇంటర్మీడియెట్ చదువుతుండగా, కుమారుడు లక్ష్మీనారాయణ 6వ తరగతి చదువున్నాడు. తండ్రి మృతితో చిన్నారులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.


హత్యకు గురైన వెంకట చెన్నయ్య మృతదేహం



చెన్నయ్య(ఫైల్)

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 20 మందికి జైలు

ఒంగోలు టౌన్: ఒంగోలు ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20 మందికి 15 రోజుల జైలు శిక్ష లేదా రూ.10 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు న్యాయస్థానం శుక్రవారం తీర్పు చెప్పింది. వీరిలో 17 మంది ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున జరిమానా చెల్లించగా, ముగ్గురు మాత్రం జైలుకు వెళ్లారు.

కారు ఢీకొని చిరు వ్యాపారి మృతి

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజమండ్రికి చెందిన మేడిశెట్టి గోవిందు(50) ఇటీవల కేశినేనిపల్లిలో హైవే పక్కన బడ్డీ బంకు పెట్టుకుని, భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తన దుకాణం వద్ద బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా మార్కాపురం నుంచి వినుకొండ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో సంఘటనా స్థలం వద్దే ఆయన మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.


మృతి చెందిన గోవిందు